ప్రమాదకరంగా గుంతలు

బజార్‌హత్నూర్ నుంచి సోనాల వెళ్లే మార్గంలో గుంతలు

బజార్‌హత్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో గల ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు అతివేగంతో రావడంతో గుంతలు గమనించకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో అయితే కనీసం గుంతలు గమనించక ప్రమాదాలు జరిగిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఇది వరకే ఈ గుంతలలో పడి ఇద్దరు మృతి చెందిన ఘటనలు చోటు చేసుకున్నాయి. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవ తీసుకొని గుంతలను పూడ్చి వేయాలని వాహనాదారులు, ప్రజలు కోరుతున్నారు. – బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 4

సాకేరకు చేరుకున్న మెస్రం వంశీయులు

వెదురు బుట్టల వద్ద పూజలు చేస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 4: దోడంద గ్రామం నుంచి మెస్రం వంశీయులు గంగాజలం ఝరితో ఆదివారం రాత్రి ఉట్నూర్ మండలం సాకేర గ్రామానికి చేరుకున్నారు. గ్రామ పోలిమేరలో గంగాజలం ఝరిని భద్రపర్చి ప్రత్యేక పూజలు చేసి కుటుంబ సమేతంగా మొక్కుకున్నారు. సాకేరకు కుటుంబ సమేతంగా చేరుకున్న మెస్రం వంశీయులు సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచే నాగోబా దేవతను దర్శించుకున్నారు. వరుసగా పెట్టిన వెదురు బుట్టల వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. అనంతరం ఎడ్ల బండ్ల వద్దనే ప్రత్యేక గుడారాలు ఏర్పాటు చేసుకొని రాత్రి అక్కడే బస చేశారు. సోమవారం ఉదయం సాకేర నుంచి మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకోనున్నట్లు మెస్రం వంశీయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కటోడ మెస్రం కోసు, కోసే రావ్ కటోడ, మెస్రం ధర్మ, మెస్రం వంశీయులు గణపతి, చిత్రు, మారుతి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319429-All

తెలుగులో ఉచిత ఖుర్‌ఆన్ కొరకు
ఫోన్ చేయండి 1800 572 3000
సమస్యలన్నిటికీ పరిష్కారం దైవసందేశం ద్వారానే సాధ్యం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

ఇసుక, మొరం రవాణా చేస్తే చర్యలు

ఎదులాపురం, ఫిబ్రవరి 4 : ఇసుక, మొరం రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని మైనింగ్ ఏడీ రవిశంకర్ అన్నారు. ఆదివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 27వ తేదీ నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 10 వాహనాలను సీజ్ చేసి దాదాపు రూ.లక్ష వరకు జరిమానా విధించామని తెలిపారు. ఇసుక కావాల్సిన వారు చెన్నూర్‌లో ఇసుక రీచ్ నుంచి వే బిల్లు తెచ్చుకోవాలన్నారు. సీజ్ చేసిన వాహనాలను ఆర్టీసీ డిపోలో భద్రపరిచామని పేర్కొన్నారు.

పంచాయతీలకు ప్రత్యేకాధికారులు

భీంపూర్, ఫిబ్రవరి 4 : మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. కరంజి(టీ)కి డాక్టర్ శ్రీకాంత్, కరణ్‌వాడి, టేకిడి రాంపూర్, గోముత్రి, గుబిడికి డాక్టర్ గజానన్, అందర్‌బంద్, జలకొరిలకు రాంమోహన్, అంతర్గాం, అర్లి(టీ), భగవాన్‌పురా, ఇందూర్‌పల్లికి కే హరిదాస్, బేల్సరిరాంపూర్, భీంపూర్, కైరిగూడ, మర్కాగూడకు ఎం శ్రీనివాస్, ధనోరా, గోనా, గుంజాల, కామట్‌వాడ, వడూర్‌కు డాక్టర్ సుభాష్, గొల్లగడ్, గుబిడిపల్లి , నిపాని, పిప్పల్‌కోటి, వడ్‌గాం, తాంసి(కే)కు అహ్మద్‌ఖాన్‌ను నియమించారు.

కన్గుట్ట వీడీసీ కమిటీ ఎన్నిక

బోథ్, ఫిబ్రవరి 4: కన్గుట్ట వీడీసీ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవ్వ రవి, ఉపాధ్యక్షులుగా శంశొద్దీన్, సభ్యులుగా కుమ్మరి రమణ, భోజారెడ్డి, అశోక్, చాకలి రమణ, రమేశ్, రాజు, బొడ గంగయ్య, గడ్డల నారాయణ, బొడ్డు పోశెట్టిని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ముజిగె మల్లన్న పల్లకీ ఊరేగింపు

భీంపూర్, ఫిబ్రవరి 4 : పిప్పల్‌కోటి, గొల్లగడ్ గ్రామాలకు ఆదివారం ముజిగె నుంచి వచ్చిన మల్లన్న పల్లకీని గ్రామస్తులు దర్శించుకున్నారు. యాదవకుర్మలు మొక్కులు చెల్లించుకున్నారు.

వంతెన గతి..ఇంతేనా..?

- కొట్టుకుపోయిన స్లాబ్
- ఇబ్బందులు పడుతున్న గిరిజనులు

నక్కలవాడ వాగుపై దెబ్బతిన్న వంతెన

బోథ్, ఫిబ్రవరి 4 : బోథ్ మండలంలోని నక్కలవాడ సమీపంలో పెద్దవాగుపై నిర్మించిన వంతెన భారీ వర్షాలకు దెబ్బతిన్నది. ఒక కాలం (సుమారు పది మీటర్లు) స్లాబ్ కొట్టుకుపోయింది. వానకాలంలో గిరిజనులకు ఇబ్బంది కలిగిస్తున్నది. కరత్వాడ (బోథ్) ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నీటి నిలువ (బ్యాక్ వాటర్)ను అంచనా వేస్తూ నక్కలవాడ సమీపంలోని పెద్దవాగుపై కల్వర్టు వంతెన నిర్మాణం చేపట్టారు. ఐదారేళ్లుగా భారీ వర్షాల మూలంగా ఏడాదిలో ఐదారు నెలల పాటు వంతెనపై నుంచి నీరు పారుతుండడంతో స్లాబ్ దెబ్బతింది. 2022 సంవత్సరంలో జూన్, జూలై మాసాల్లో కురిసిన భారీ వర్షాలతో వంతెన వద్ద పెద్ద గొయ్యి ఏర్పడింది. క్రమేనా స్లాబ్ కొట్టుకు పోయింది. వంతెనపై నుంచి వరద ప్రవహిస్తున్న సమయంలో దెబ్బతిన్న చోటు నుంచి దాటేందుకు గిరిజనులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దాటాల్సిన దుస్థితి ఏర్పడింది. కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో కొత్త వంతెన నిర్మాణానికి సర్వే చేయించింది. సుమారు రూ.3.50 కోట్ల నిధులు అవసరమని అంచనాలు రూపొందించారు. ఎఫ్‌డీఆర్ నిధులు కేటాయించాలని నిర్ణయించారు. అయితే ఎన్నికలు రావడంతో నిధుల మంజూరులో జాప్యం ఏర్పడింది. ప్రస్తుతం మరమ్మతుల కోసం రూ.18 లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. వచ్చే వానకాలంలోగా వంతెన నిర్మాణం చేపట్టకపోతే తాము ఐదారు నెలల పాటు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని నక్కలవాడ, కొత్తపల్లె, లక్ష్మీపూర్, రేండ్లపల్లె గ్రామాల ఆదివాసీ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వంతెన కోసం నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

వంతెన పరిశీలనకు దాటి వెళ్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర పవార్ (ఫైల్)

కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలి...

పాత వంతెన పూర్తిగా దెబ్బతిన్నందున కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలి. వానకాలంలో ఈ వంతెన ఎప్పుడు పడిపోతుందోనని భయమేస్తున్నది. వంతెన కొట్టుకుపోతే నాలుగు గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బంది అవుతది.

- కొడప విజయ్, మాజీ సర్పంచ్, నక్కలవాడ

వానకాలంలోగా వంతెన నిర్మించాలి...

వచ్చే వానకాలంలోగా వంతెన నిర్మాణం చేపట్టాలి. ఇప్పటికే వంతెన పరిస్థితి ఆందోళన కలిగిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి సర్వే చేయించింది. ఎన్నికలు రావడంతో ప్రతిపాదనలు నిలిచిపోయాయి. వంతెన కట్టకపోతే నాలుగు గ్రామాల ఆదివాసీలు ఇబ్బందులు పడాల్సి వస్తది.

-గొడం జుగదిరావ్, ఎంపీటీసీ, కరత్వాడ

పాలకవర్గానికి సన్మానం

పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామ పంచాయతీ, వీడీసీ సభ్యులు

బోథ్, ఫిబ్రవరి 4 : కౌఠ(బీ) పంచాయతీ పాలకవర్గాన్ని ఆదివారం గ్రామ పంచాయతీ, వీడీసీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. సర్పంచ్ పదవికే విరమణ కాని ప్రజా సేవకు కాదని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్నూర్, ఫిబ్రవరి 4 : తాడిహత్నూర్‌లో గ్రామస్తులు మాజీ సర్పంచ్ రాథోడ్ మధుకర్, మాజీ ఉపసర్పంచ్ విష్ణుఫడ్, మాజీ వార్డు సభ్యులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా తహసీల్దార్ల కార్యవర్గం ఎన్నిక

ఎదులాపురం, ఫిబ్రవరి 4 : తెలంగాణ తహసీల్దార్ల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆరేటి రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్తేర్ వర్ణ, అసోసియేట్ అధ్యక్షులుగా భోజన్న(కాసిపేట), శ్యాంసుందర్(జైనథ్), ఉపాధ్యక్షులుగా సుభాష్ చందర్, సంపత్ శ్రీనివాస్, నలంద ప్రియ, కోశాధికారిగా ఇమ్రాన్‌ఖాన్(నెన్నెల), ప్రచార కార్యదర్శిగా దిలీప్ కుమార్, కార్యదర్శులుగా తుకారాం, సంతోష్‌రెడ్డి, శ్రీనివాసరావు, లక్ష్మి, వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 4 : బెల్లూరి క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన న్యాయవాదులు, జైలు సిబ్బంది స్నేహపూర్వక క్రికెట్ పోటీలను ఆదివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమాలు

పెండల్‌వాడలో బద్ధ గంగారెడ్డికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

జైనథ్, ఫిబ్రవరి 4 : రాష్ట్రంతో పాటు ఆదిలాబాద్‌లోని ఆయా గ్రామాల్లోని వ్యవసాయ కార్మికుల హక్కుల సాధన కోసం సీపీఐ అనేక ఉద్యమాలు చేపడుతున్నదని జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పెండల్‌వాడ గ్రామంలో కామ్రేడ్ బద్ధం గంగారెడ్డి 34వ వర్ధంతి నిర్వహించారు. గంగారెడ్డి చిత్రపటంతో ర్యాలీ తీశారు. అనంతరం స్మారక స్థూపం వద్ద గంగారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీకి, ప్రజలకు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం భూపతి రెడ్డి, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రతిభా కళాశాలల ప్రవేశ పరీక్ష

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 4 : సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడలోని నాలుగు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. బాలురు 640, బాలికలు 1083 మొత్తం 1723 మందికి గాను 1684 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 97.7 హాజరు శాతం నమోదైంది. ఈ పరీక్ష ద్వారా సాంఘిక సంక్షేమ ప్రతిభ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

టోర్నీ విజేత అంతర్గాం జట్టు

అంతర్గాం జట్టుకు నగదు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు

భీంపూర్, ఫిబ్రవరి 4 : అర్లి(టీ) గ్రామంలో బీఆర్ఎస్ యువనాయకుడు వైభవ్‌యాదవ్ అతని స్నేహితుడు సల్మాన్ స్మారకార్థం కుటుంబీకులు, స్నేహితులు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. మొదటి బహుమతి రూ.25,000 అంతర్గాం త్రినేత్ర జట్టు, రెండో స్థానంలో ఇందూర్‌పల్లి, మూడో స్థానంలో అర్లి(టీ), నాలుగో స్థానంలో పిప్పల్‌కోటి జట్లు నిలిచాయి. వీరికి గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు బహుమతులు ప్రదానం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగి తీగ చోరీ

నార్నూర్, ఫిబ్రవరి 4 : మహాగావ్ గ్రామ శివారులోని పంట పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కపర్‌వైర్‌ను చోరీ చేశారని రైతు రాథోడ్ ప్రహ్లాద్ తెలిపారు. రాగి తీగను తీసుకెళ్లి పరికరాలు పడేసి వెళ్లారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశామని రైతు తెలిపారు.

ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇచ్చోడ, ఫిబ్రవరి 4 : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1988-89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాడు తమకు బోధించిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లక్ష్మణ్, దీపక్, లక్ష్మి, పూర్వ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

క్రీడలతో మానసికోల్లాసం

బహుమతి అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, ఫిబ్రవరి 4 : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ఆదివారం కౌఠ(బీ) గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ పోటీలో గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

జిల్లా సదస్సులో పాల్గొన్న నాయకులు

ఎదులాపురం, ఫిబ్రవరి 4 : కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని సెంట్రల్ గార్డెన్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించిన చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నాలుగు కోడ్‌లను తెచ్చిందన్నారు. నిత్యావసర ధరలు పెంచుతూ సామాన్య ప్రజల కొనుగోలు శక్తిని తగ్గించిందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి రాజన్న, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్, బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల కిరణ్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, కార్మిక సంఘాల నాయకులు ఆశన్న, జగన్‌సింగ్, అశోక్, దేవీదాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఖేలో ఇండియా సెంటర్ రావడం అభినందనీయం

క్రీడాకారులకు హాకీస్టిక్స్ అందజేస్తున్న సంఘం అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి

ఎదులాపురం, ఫిబ్రవరి 4 : అన్ని క్రీడా వసతులు ఉన్న ఆదిలాబాద్‌కు ఖేలో ఇండియా సెంటర్ రావడం అభినందనీయమని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఖేలో ఇండియా సెంటర్ ద్వారా హాకీ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారికి హాకీ స్టిక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, హాకీ కోచ్ శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన 'పూసాయి ఎల్లమ్మ'

పూసాయి ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తులు

జైనథ్, ఫిబ్రవరి 4 : పూసాయి గ్రామంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ జాతరకు ఆదివారం భక్తులతో పోటెత్తింది. జిల్లా నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఎండ్ల బండ్లతో పాటు ఇతర వాహనాలతో కుటుంబ సమేతంగా వచ్చి గుడారాలు వేసుకొని కోళ్లు, మేకలు, మాంసాహార, పిండి వంటకాలు చేసుకొని పండుగ జరుపుకున్నారు.

పూసాయి ఎల్లమ్మ ఆలయం వద్ద గారెలు, అప్పలు చేస్తున్న మహిళలు

ఖాందేవ్ జాతర భక్తజనసంద్రం

ఖాందేవ్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నార్నూర్, ఫిబ్రవరి 4 : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఖాందేవ్ జాతరకు ఆదివారం భక్తులతో జనసంద్రమైంది. ఉమ్మడి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఖాందేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతర వెలిసిన దుకాణాల వద్ద సామగ్రి కొనుగోలు, హోటల్లో కుటుంబ సమేతంగా తినుబండారాలు తింటూ కనిపించారు. జాతర సందర్భంగా నిర్వహిస్తున్న వాలీబాల్, క్రికెట్, కుస్తీ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ నెల 8వ తేదీ వరకు జాతర కొనసాగుతుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు.